బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి తన పుట్టినరోజు సందర్భంగా మొక్కను అందించిన మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి. ఈ సందర్భంగా కేసీఆర్ ముత్తిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, గంగులకమలాకర్, ఎమ్మెల్సీలు సత్యవతి, రమణ

అరికెపూడిని పీఏసీ చైర్మన్‌గా ఒప్పుకోం!

- ఆయనపై అనర్హత పిటిషన్ ఉంది
- నామినేషన్ వేయని వ్యక్తి చైర్మనా?
- పీఏసీ మీటింగ్‌ను వాకౌట్ చేసిన బీఆర్ఎస్ సభ్యులు వేముల, గంగుల, సత్యవతి, రమణ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేగా న్యాయస్థానంలో అనర్హత కేసు విచారణను ఎదుర్కొంటున్న అరికెపూడి గాంధీని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా తాము ఒప్పుకోబోమని బీఆర్ఎస్ సభ్యులు తేల్చిచెప్పారు. అసెంబ్లీ కమిటీ హాలులో మంగళవారం అరికెపూడి గాంధీ అధ్యక్షతన పీఏసీ సమావేశం నిర్వహించగా, బీఆర్ఎస్ సభ్యులైన ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, ఎల్ రమణ బహిష్కరించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావును కాదని అరికెపూడి గాంధీని పీఏసీ చైర్మన్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. తమ పార్టీ నుంచి పీఏసీ చైర్మన్‌గా వేసిన బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ అనర్హత కేసు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పీఏసీ చైర్మన్‌గా సమావేశాన్ని నిర్వహించడం సమంజసం కాదని స్పష్టంచేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధంగా పీఏసీ చైర్మన్ ఎంపిక చేయడం దారుణమని పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నామినేషన్‌ను కాదని, నామినేషన్ వేయని అరికెపూడి గాంధీని అక్రమంగా ఎంపిక చేయడం సరికాదని తెలిపారు. పీఏసీ చైర్మన్ ఎన్నికపై సర్కారు పునరాలోంచాలని కోరినా అందులో ఎటువంటి మార్పు రాకపోవడంతో తాము సమావేశాన్ని బహిష్కరించామని తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరిన అరికెపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు మూడు సమావేశాలను బహిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. అవసరమైతే 30 సమావేశాలను బహిష్కరిస్తాం. కానీ, ఎట్టి పరిస్థితుల్లో వెన్నుపోటుదారుడిని పీఏసీ చైర్మన్‌గా ఒప్పుకోబోమని తేల్చిచెప్పారు. హరీశ్‌రావును ఇప్పటికైనా పీఏసీ చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యుడికి ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ పదవిని సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ఆలోచనలతో పార్టీ మారిన సభ్యుడికి ఇవ్వడం అప్రజాస్వామికమని విమర్శించారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ అరికెపూడి గాంధీ ఇంతకూ ఏ పార్టీ సభ్యుడో ధైర్యముంటే చెప్పాలని డిమాండ్ చేశారు. గాంధీని పీఏసీ చైర్మన్‌గా అంగీకరించే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు.

హైదరాబాద్‌లో ఖమ్మం జిల్లా నాయకులతో సమావేశమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

కాంగ్రెస్‌పై తిరుగుబాటు తప్పదు

- ప్రజలు నిలదీసే రోజులు దగ్గర్లోనే
- 14 నెలల కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు అన్యాయం
- ప్రతి కాంట్రాక్టు ఖమ్మం జిల్లా మంత్రికే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఖమ్మం నాయకులతో సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తేతెలంగాణ): మోసం చేసిన కాంగ్రెస్‌పై తిరుగుబాటు తప్పదని, ప్రజలు నిలదీసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ నివాసంలో ఖమ్మం జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కార్యక్రమానికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్, పార్టీ నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, బొమ్మెర రామ్మూర్తి, కూరాకుల నాగబాబు, కర్నాటి కృష్ణ, పగడాల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బర్త్‌డే ఫంక్షన్లు, పనికిరాని పనులకు వెళ్లేందుకు హెలికాప్టర్లను వినియోగిస్తున్న మంత్రులు, ఖమ్మం వరదలప్పుడు మాత్రం బాధితుల కోసం పంపకుండా చేతులెత్తేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం, చేతగానితనానికి ఓ నిరుపేద కుటుంబం బలైందని గుర్తుచేశారు. ఖమ్మంలో డిప్యూటీ సీఎంతో పాటు ఇద్దరు మంత్రులున్నా చేసిందేమీలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి సైతం వరద ప్రభావిత ప్రాంతాల్లో చేతులు ఊపుకొంటూ పర్యటించారు తప్ప చేసిందేమీలేదని ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మం జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిందని, కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నష్టం జరిగిందని చెప్పారు. ఇప్పుడు అక్కడి ప్రజలు పువ్వాడ అజయ్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, వరదల సమయంలో ఆయనే ప్రజలకు అన్నివిధాలా అండగా ఉన్నారని గుర్తుచేశారు. కష్టకాలంలో ఉన్న ప్రజలను బీఆర్ఎస్ ఎప్పుడూ ఆదుకుంటుందని చెప్పారు. గతంలో భూపాలపల్లిలో వరదలు వచ్చిన సమయంలో నాలుగు హెలికాప్టర్లు పంపించి ప్రజలను కాపాడుకున్నామని పేర్కొన్నారు.

కాంట్రాక్టులన్నీ ఖమ్మం మంత్రికే

14 నెలల కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలు దగాపడ్డాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని, బడ్జెట్‌లో లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించి సబ్‌ప్లాన్ అమలు చేస్తామని నమ్మబలికి నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. కాలేజీ పిల్లలు స్కూటీల కోసం పోస్ట్‌కార్డుల ఉద్యమాన్ని మొదలుపెట్టారని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా లేకుంటే ఎంతో నష్టపోయామనే భావనలో తెలంగాణ ప్రజలు ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంతో పాటు, తెలంగాణలో ప్రతి పనికి సంబంధించిన కాంట్రాక్టులు ఖమ్మం జిల్లా మంత్రికే దక్కుతున్నాయని విమర్శించారు. కాంట్రాక్ట్ మంత్రి కమీషన్ల కోసమే ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని దెప్పిపొడిచారు. డిప్యూటీ సీఎం కూడా 30 శాతం కమీషన్లు తీసుకొని పనిచేస్తున్నారని వారి పార్టీ ఎమ్మెల్యేలే చెప్తున్నారని, ముఖ్యమంత్రి రుణమాఫీ అయిందని అంటుంటే, వ్యవసాయ మంత్రి కాలేదంటున్నారని, ఎవరి మాటలు నమ్మాలో తెలియక రైతులు తలలు పట్టుకొనే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. పోలీసులను అడ్డం పెట్టుకొని సర్పంచ్ ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు ముగ్గురు మంత్రులు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. వారి ఆటలను సాగనివ్వబోమని హెచ్చరించారు.

కేసీఆర్ పుట్టిన రోజున వృక్షార్చన

17న కేసీఆర్ జన్మదినం సందర్భంగా ప్రతిఒక్కరూ మూడు మొక్కలు నాటాలి

- ఆయనకు మనమిచ్చే బర్త్‌డే కానుక ఇదే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నేతలతో కలిసి వృక్షార్చన పోస్టర్ ఆవిష్కరణ



కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించే వృక్షార్చన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీలు సంతోష్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి, మాజీ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, గణేశ్‌గుప్తా, శంకర్‌నాయక్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 17న వృక్షార్చన నిర్వహించనున్నట్టు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. వచ్చే సోమవారం ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవటమే కేసీఆర్‌కు మనం ఇచ్చే పుట్టినరోజు కానుక అని చెప్పారు. హరిత తెలంగాణ స్వాప్నికుడు కేసీఆర్ సంకల్పానికి మద్దతుగా చంద్రునికో నూలు పోగులా గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ వృక్షార్చన కార్యక్రమాన్ని తలపెట్టినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమ పోస్టర్‌ను హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో మంగళవారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ ఆఫీస్ సెక్రటరీ, రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, శంకర్‌నాయక్, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో-ఫౌండర్ రాఘవ సమక్షంలో కేటీఆర్ విడుదల చేశారు. తన మేధో పుత్రిక హరితహారం ద్వారా తెలంగాణ భూతల్లికి కేసీఆర్ ఆకుపచ్చని చీర చుట్టారని గుర్తుచేశారు. వృక్షార్చన కార్యక్రమం తీసుకున్న పార్టీ జనరల్ సెక్రటరీ, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్‌ను కేటీఆర్ అభినందించారు. రాష్ట్రం, దేశం పచ్చబడాలనే సంకల్పంతో గ్రీన్ ఇండియా చాలెంజ్ చేస్తున్న ఈ వృక్షార్చనలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సంతోష్‌కుమార్ కోరారు. హరితసేనలోని సభ్యులంతా మొక్కలు నాటి అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని విజ్ఞప్తిచేశారు.

మళ్లీ సర్వే నిర్వహించాలి

- కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నదో లేదో చూడాలి
- మాకైతే అనుమానంగానే ఉంది
- డాటా వెరిఫికేషన్, విశ్లేషణ చేయకుండా ఎలా నిర్ధారిస్తారు?
- 'నమస్తే తెలంగాణ'తో నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ కన్వీనర్ ప్రొఫెసర్ మురళీమనోహర్



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): బీసీ కులగణన సంపూర్ణంగా జరగలేదని, అసంబద్ధంగా ఉన్నందున రీ సర్వే చేయాలని నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ కన్వీనర్, రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీమనోహర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఆ చిత్తశుద్ధి ఉన్నదా? లేదా? అన్నది వేచి చూడాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వేపై రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాల ప్రతినిధులకే కాకుండా సాధారణ బీసీ ప్రజలకు సైతం అనేక అనుమానాలున్నాయని చెప్పారు. డాటా వెరిఫికేషన్ చేయకుండా బీసీల జనాభా ఇంత అని ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. బీసీ కులగణనపై నిరసనలు, అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయన 'నమస్తే తెలంగాణ'కు ఇంటర్వ్యూ ఇచ్చారు.

నమస్తే తెలంగాణ: కులగణన విషయంలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలు, ప్రభుత్వ వాదనలపై మీరేమంటారు?

మురళీ మనోహర్: అనేక పోరాటాలు, చర్చోపచర్చల తరువాత ప్రభుత్వం కులగణన చేపట్టింది. దీన్ని స్వాగతిస్తున్నాం. సర్వే అనంతర పరిణామాలను చూస్తే అనేక అనుమానాలు కలుగుతున్నాయి. సర్వేలో మైగ్రెంట్స్‌ను కవర్ చేయలేదు. వలసపోయినవారు బోలెడంత మంది ఉన్నారు. వారిని సర్వే చేసే ప్రయత్నం చేయలేదు. ఈ ఎలక్ట్రానిక్ ప్రపంచంలో కనీసం ఒక యాప్ అయినా క్రియేట్ చేయలేకపోయింది. ఇండ్లు లేనివారిని, రోడ్ల పక్కన నివసించేవారిని కవర్ చేయలేదు. అన్నింటి కన్నా ముఖ్యంగా అగ్రకుల జనాభా పెరిగిందని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం జనాభా తగ్గిందని చెప్తున్నరు. అదెలా సాధ్యం? ఓసీ జనాభా పెరిగినప్పుడు బీసీలు ఎలా తగ్గుతారు. వారితో సమాంతరంగా వీళ్లు (బీసీలు) పెరగాలి కదా? ఒక కమ్యూనిటీ పెరిగి, మరో కమ్యూనిటీ తగ్గడం అన్నది ఏ జనాభా సిద్ధాంతరీత్యా చూసినా సాధ్యం కాదు. కుటుంబాల సంఖ్య చివరి మూడేండ్లలో 1% పెరిగింది అన్నప్పుడు అందరూ పెరగాలి అలా పెరగలేదు.

ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చిందని భావిస్తున్నారా?

ప్రభుత్వానికి అంత ఆత్రం దేనికి? కులగణన సర్వే నివేదికను క్యాబినెట్ సబ్ కమిటీకి ఇవ్వడం, మీడియా సమావేశం పెట్టడం, ఆ వెంటనే మంత్రివర్గ సమావేశంలో ఆమోదించడం, వెనువెంటనే అసెంబ్లీలో ప్రకటించడం.. ఈ మొత్తం ప్రక్రియను చూసినప్పుడు.. అనుమానాలు ఉండకుండా ఎందుకుంటాయి? కనీసం చదవొద్దా? డాటా అంటేనే వెరిఫికేషన్ ఉండాలి.

అసలు మీ అభ్యంతరం ఏమిటి? బీసీ జనాభా తగ్గినందుకా? ఇతరుల జనాభా పెరిగినందుకా?

మా అభ్యంతరం బీసీ జనాభా తగ్గినందుకో.. ఓసీల జనాభా పెరిగినందుకో అన్నది కాదు ప్రధానం. ఓసీ జనాభా పెరిగిందని మొత్తానికి జనాభాను తప్పు చూయించారు. గతంలో జరిగిన అనేక సర్వేలు, దశాబ్ది పెరుగుదల చూసినా ఒకరి జనాభా పెరిగితే, మరొకరి జనాభా అదే దామాషాలో పెరగాల్సిందే. సంచార జాతులను, మైగ్రెంట్స్‌ను సర్వే చేయలేదు. ప్రధానంగా ఇంతకుముందున్న అంటే

ప్రభుత్వానికి మీవైపు నుంచి సూచన ఇంకేదైనా ఉన్నదా?

సాధారణంగా ఇలాంటి సర్వే నిర్వహించినప్పుడు ఎక్కడైనా నిపుణులతో డాటాను వెరిఫై చేయించడం, అవసరమైన చోట, అనుమానం ఉన్నచోట రీటెస్ట్ చేయించడం లాంటివి ఇక్కడ జరగలేదు. డాటా వాలిడేషన్, డాటా వెరిఫికేషన్ చేయాలి. శాంపిల్ రీ టెస్టింగ్ చేయాలి. కానీ ప్రభుత్వం చేయలేదు. ఎక్స్‌పర్ట్ బాడీని వేయమని చెప్పినం. ఆ డెడికేటెడ్ కమిషన్ కూడా ఎక్స్‌పర్ట్ బాడీని వేయాలి. అది అసలు పనిచేస్తున్నదా? లేదా అనేది ఎవరికీ తెలియదు. ఆ కమిషన్ రిపోర్ట్ సమర్పించిన తరువాత రిజర్వేషన్లు చేయాలి. ఇంటింటి సర్వేలో మిగిలిపోయినవారి, ఇండ్లు లేని రోడ్డు పక్కన, చెట్ల కింద, నిర్మాణ పనుల ఆశ్రమాల్లో ఉన్న వారిని, వలస వెళ్లినవారిని సర్వేలో భాగస్వామ్యం చేయాలి. ఒక యాప్‌ను రూపొందించాలి. పంచాయతీ, వార్డు ఆఫీస్ సహా అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న సమాచారం సేకరించలేదు. సర్వే సక్రమంగా జరగకపోవడంతోనే బీసీల సంఖ్య పడిపోయినట్టు భావించాల్సి వస్తుంది. వీటిని సవరించుకోవాలి.

1931 కుల జనాభా గణాంకాల నుంచి అనేక కమిషన్లు సేకరించిన సమాచారం ముఖ్యంగా అనంతరామన్ కమిషన్, మురళీధర్‌రావు కమిషన్, ఇతర రాష్ట్రస్థాయి కమిషన్లు, మండల్ కమిషన్, ఎస్సీ కమిషన్లు, మైనార్టీ కమిషన్లు జాతీయ స్థాయిలో సేకరించిన సమాచారం, రాష్ట్రస్థాయిలో సమగ్ర కుటుంబ సర్వే-2014 లెక్కలు, లేబర్ సర్వేలు అన్నీ విడివిడిగా క్రోడీకరించి చూస్తే, బీసీ, ఎస్సీ, మైనార్టీల జనాభా తక్కువగా సూచించినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. సేకరణ దశ లేదా టాబ్యులేషన్ లేదా క్రోడీకరణ, విశ్లేషణ సందర్భంగా లోపాలు జరిగినట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. ఆయా సర్వేలు బీసీ, ఎస్సీ, మైనార్టీల జనాభా లెక్కల నిష్పత్తితో చూస్తే బీసీల జనాభా శాతం పెరిగినట్టు తెలుస్తున్నది. దశాబ్ది గ్రోత్ రేట్ అంచనాల ప్రకారం కనీసం 1% పెరుగుదల సూచించినా బీసీ జనాభా సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశమే ఉన్నది.

సర్వేను తిరిగి చేయాలనా మీ ఉద్దేశం?

అసమగ్రంగా, అసంపూర్తిగా జరిగినట్టు ఆధారాలున్నాయి. తిరిగి మొత్తం చేస్తరా? కవర్‌కానివారిని చేస్తరా? అన్నది ప్రభుత్వానికి సంబంధించినది. తప్పుల్లేకుండా, అనుమానాలకు తావివ్వకుండా సమాజంలో 'ఉన్నది ఉన్నట్టు'గా సర్వే ప్రతిఫలించేలా ఉండాలి. అలా ప్రతిఫలించాలంటే ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన అవసరం ఉన్నది.

బీసీల పట్ల తమకు ఉన్న చిత్తశుద్ధికి వేగిరం నిదర్శనమన్నట్టుగా ప్రభుత్వం చెప్తున్నది కదా?

సర్వేను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలి. కులాలవారీగా జన సంఖ్య ఇవ్వాలి. అలా ఏమీ చేయకుండా ఆదరాబాదరగా 'చేశాం అన్నట్టుగా చేయడంపైనే' ప్రభుత్వం దృష్టిసారించింది కానీ, అందులో చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించడం లేదు. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి చెప్పినం. అశాస్త్రీయంగా చేశారని ఆధారాలతో చెప్పినం. ఈ మొత్తం ప్రక్రియలో ఇన్ని తప్పులు జరిగాయి. వీటిని ఎట్లా సవరిస్తారు? అని అడిగినం. కవర్‌కానీ వాళ్లను కవర్ చేయాలి. అందుకే రీ సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నం. స్పెషల్‌డ్రైవ్ చేయాలని, అవసరమైతే ఒక 'యాప్' క్రియేట్ చేయాలని సూచించాం. తప్పకుండా చేస్తమన్నరు. కానీ, చేస్తరు అని నేను అనుకోవడం లేదు. చేస్తరా? చేయరా? అనేది వేచి చూడాలి.

స్థానికంపై తర్జన భర్జన

మొదటిపేజీ తరువాయి...

వారికి కేటాయించాల్సిన రిజర్వేషన్లపై స్పష్టమైన సూచనలు చేసింది. రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు జనాభా అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాల్సి ఉన్నది. కులగణన ప్రకారం ఎస్సీలకు 17.43 శాతం, ఎస్టీలకు 10.45 శాతం కలిసి సుమారు 28 శాతం కేటాయించాల్సి ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని పంచాయతీలను పూర్తిగా ఎస్టీలకు రిజర్వ్ చేయాల్సి వస్తుంది. ఇక మిగిలిన స్థానాల్లో బీసీలకు రిజర్వ్ చేసే వీలుంటుంది. ఈ ప్రకారం 56.33 శాతం ఉన్న బీసీలకు కేవలం 22 శాతం కోటా మాత్రమే దక్కనున్నది. దీంతో కమిషన్ సిఫారసులపై పూర్తిగా అధ్యయనం తర్వాతే ముందుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. బీసీలకు ఇవ్వాల్సిన 22శాతం కోటాను జనరల్‌గా పరిగణించి పార్టీపరంగా 42శాతం ఇవ్వాలని నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతున్నది. 42 శాతం కోటా ఇచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మార్చిలో టెన్త్, ఇంటర్ పరీక్షలు..

ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఎలక్షన్ కమిషన్ అధికారులు చెబుతున్నారు. అయితే ఇందుకు కనీసం 21 రోజుల గడువు కావాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. మార్చి 5 నుంచి ఇంటర్, 21 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలంటే ఫిబ్రవరి 20లోపే నోటిఫికేషన్ రావాల్సి ఉంటుంది. కానీ పరిస్థితులు అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలపై సీఎం రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్‌లో బుధవారం సమావేశం నిర్వహించనున్నారు. డెడికేషన్ కమిషన్ నివేదిక, బీసీ రిజర్వేషన్లపై చర్చించనున్నట్టు తెలిసింది. ఆ తర్వాతే ఎన్నికల నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

23 శాతమైనా బీసీలకు దక్కేనా?

మొదటిపేజీ తరువాయి...

ఎసరు తెచ్చింది. దీంతో ప్రస్తుతం ఉన్న 23% రిజర్వేషన్ల అమలుపైనే అనుమానం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పట్టించుకోని ప్రభుత్వం.. అనాలోచితంగా చేపట్టిన చర్యల కారణంగా మొత్తానికే బీసీ రిజర్వేషన్ కోటా లేకుండా పోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి 'పార్టీ పరంగా 42% రిజర్వేషన్లు ఇస్తాం' అంటూ కొత్త రాగం అందుకున్నారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుపై సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టమైన మార్గదర్శకాలను జారీచేసింది. వీటినే ట్రిపుల్ టెస్ట్ అని కూడా పిలుస్తారు. స్థానిక సంస్థల్లో కేవలం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు ఉన్నాయి. దీంతో రాష్ట్రాలు ఆర్టికల్ 243-డీ(6), 243-టీ(6) ప్రకారం ఇష్టానుసారం రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి. ఈ విధానంపై కర్నాటకకు చెందిన కే కృష్ణమూర్తి గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2010లో తీర్పును వెలువరించింది.

సీఎం నోట 'పార్టీ కోటా'

సర్వేలో లోపాలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ఇతర పరిమితుల కారణంగా రాజ్యాంగబద్ధంగా బీసీలకు 42% కోటా ఇవ్వడం సాధ్యంకాదని కాంగ్రెస్ నాయకత్వానికి ముందే తెలుసని విశ్లేషకులు చెప్తున్నారు. అందుకే 'పార్టీపరంగా 42% కోటా ఇస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నారని పేర్కొంటున్నారు. ఒడిశాలో బీసీ రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత.. పార్టీపరంగా ఆ రాష్ట్రంలో బీసీలకు 50% కోటా ఇచ్చినట్టు గుర్తుచేస్తున్నారు. ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా సర్వే ఆధారంగా ఎస్సీ, ఎస్టీలకు 28% కోటా ఇచ్చి.. మిగతా జనర ల్ చేస్తారని అనుమానాలు వ్యక్తంచేస్తున్నా రు. ఈ దశలో 'పార్టీ కోటా' వ్యాఖ్యలపై బీసీ లు భగ్గుమంటున్నారు. కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు 42% బీసీ రిజర్వేషన్లు కల్పించాలని పట్టుబడుతున్నారు. పార్టీపరంగా ఇస్తే ఒరిగేదేమీ ఉండదని చెబుతున్నారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఇవే..

సుప్రీంకోర్టు ధర్మాసనం బీసీ రిజర్వేషన్ల కేటాయింపునకు మూడు దశలను సూచించింది. ముందుగా ఆర్టికల్ 340 ద్వారా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలి. తర్వాత ఆయా వర్గాల రాజకీయ వెనకబాటుతనాన్ని గ్రామస్థాయిలో శాస్త్రీయ పద్ధతిలో స్వతంత్రంగా ఆ కమిషన్ అధ్యయనం చేయాలి. చివరగా మొత్తం రిజర్వేషన్లు 50% మించకుండా ఓబీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తూ సిఫారసులు చేయాలి. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఈ విధానాన్ని పాటించాల్సిందేనని మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గవాళి కేసులోనూ సుప్రీంకోర్టు స్పష్టంగా నొక్కిచెప్పింది.

సుప్రీం మార్గదర్శకాలు బేఖాతరు

బీసీ రిజర్వేషన్ పెంపు ప్రయత్నంలో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించలేదని నిపుణులు తేల్చిచెప్తున్నారు. రాష్ట్రంలో ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రణాళిక శాఖను ఆదేశిస్తూ ప్రభుత్వం నిరుడు అక్టోబర్‌లో ఉత్తర్వులను జారీచేసింది. పర్యవేక్షణ బాధ్యతను బీసీ కమిషన్‌కు అప్పగిస్తూ జీవో 18ని విడుదల చేసింది. ప్రభుత్వం ఇక్కడే తొలి తప్పిదం చేసిందని నిపుణులు చెప్తున్నారు. ఇదే విషయంపై పలువురు హైకోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వం హడావుడిగా డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేస్తూ నవంబర్ మొదటి వారంలో జీవో 26ను విడుదల చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే మొత్తం కమిషన్ ఆధ్వర్యంలో జరగాల్సి ఉన్నది. కానీ ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌కు ఎలాంటి బాధ్యతలను అప్పగించకుండా దానిని నామమాత్రం చేసిందని విమర్శిస్తున్నారు. ఇది రెండో తప్పిదంగా వారు పేర్కొంటున్నారు. కమిషన్ ఆధ్వర్యంలో సర్వే జరగనేలేదు. దీంతో ప్రభుత్వం చెప్తున్న కులాల లెక్కలు న్యాయసమీక్షకు నిలబడవని స్పష్టంచేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే లెక్కలతో డెడికేటెడ్ కమిషన్ స్థిరీకరించే రిజర్వేషన్లు సైతం చెల్లుబాటయ్యే పరిస్థితి లేదంటున్నారు.

50% సీలింగ్‌పై అయోమయం

సుప్రీంకోర్టు చెప్పిన ట్రిపుల్ టెస్ట్‌లో 50% రిజర్వేషన్ల సీలింగ్ దాటొద్దని స్పష్టంగా ఉన్నదని నిపుణులు గుర్తుచేస్తున్నారు. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో 56.33% మంది బీసీలు, 17.43% ఎస్సీలు, 10.45% ఎస్టీలు ఉన్నట్టు పేర్కొన్నది. దీని ఆధారంగా డెడికేషన్ కమిషన్ బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంటుంది. జనాభా ఆధారంగా చూస్తే 28% ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాల్సి ఉంటుంది. అప్పుడు 50% సీలింగ్ ప్రకారం బీసీలకు మిగిలేది 22% మాత్రమే. అంటే గతంలో ఉన్న 23% కన్నా ఒక శాతం తక్కువేనని చెప్తున్నారు. ఒకవేళ డెడికేటెడ్ కమిషన్ బీసీలకు 42% కోటా కల్పిస్తే.. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్‌తో కలిపితే 70 శాతానికి చేరుతుంది. దీనిని సుప్రీంకోర్టు అంగీకరించే పరిస్థితి లేదని గుర్తుచేస్తున్నారు. అలాంటప్పుడు ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధంగా ఇచ్చే రిజర్వేషన్లు కల్పించి, మిగతా సీట్లన్నీ జనరల్‌గా మార్చి ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. ఇందుకు ఒడిశా ఉదంతాన్ని ఉదాహరణగా చూపుతున్నారు.

ఒడిశా రాష్ట్ర ఉదంతం

ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం నిరుడు ఓటరు జాబితా ఆధారంగా స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించింది. ఇది సుప్రీం మార్గదర్శకాలకు విరుద్ధమంటూ ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టేసిందని నిపుణులు గుర్తు చేస్తున్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీలకు 21% మినహా మిగతా అన్నిస్థానాలను జనరల్‌గా మార్చి ఆ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు వెళ్లాల్సి వచ్చిందని చెప్తున్నారు. రాష్ట్రంలోనూ ఇలాంటి ప్రమాదమే పొంచి ఉన్నదని, ఇదే జరిగితే గతంలో ఇచ్చిన 23% కూడా దక్కే పరిస్థితి లేదని విశ్లేషిస్తున్నారు.

42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే యుద్ధమే: ఆర్ కృష్ణయ్య



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే యుద్ధం తప్పదని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. డెడికేటెడ్ కమిషన్ బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన నివేదిక అందజేసిందని, అందులో బీసీ జనాభా వివరాలన్నీ ఉన్నాయని తెలిపారు. ఢిల్లీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డెడికేటెడ్ బీసీ కమిషన్ రిపోర్ట్, జనాభా లెక్కల ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి రిజర్వేషన్లు పెంచకుండా ప్రభుత్వం తప్పించుకోవాలని కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు 20 ఏండ్ల కిందటిదని, అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు 50 శాతం రిజర్వేషన్ సీలింగ్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఎత్తేసిందని వివరించారు. రిజర్వేషన్ల కల్పనకు ఇప్పుడు ఎలాంటి సీలింగ్ లేదని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లు పెంచేందుకు అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.